
కథ

# ఆహ్వానం-2K

దేవరకొండ గంగాధర రామారావు



**2**1వ శతాబ్దం ప్రవేశించకుండానే యావత్తు ప్రపంచం, 21వ శతాబ్దం వచ్చేసిందంటూ గగ్గోలు పెట్టేసి ఉరకలు వేస్తుంటే మా మూర్ఖుడు (మా అబ్బాయి) నిజమేననుకుని వచ్చే శతాబ్దంలో మరో దశాబ్దం ముందుకు దూకేశాడు. అసలు జరిగిందిదీ!

మా మూర్ఖ కుమారుడికి, 21వ శతాబ్ద్యారంభంలో అనగా 2001 సంవత్సరంలో, ఓ లక్షణమైన పిల్లనిచ్చి, దైవజ్ఞులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో వివాహం జరిపించాలని నేనూ, నా భార్య నిర్ణయించుకుని, అయిదు సంవత్సరాల తర్వాత అమెరికా నుండి వచ్చి, ఇంకా మద్రాస్ స్టార్ హోటల్‌లో ఖుషీ చేసుకుంటున్న మా వాడికి తెలియపరిచాం.

కానీ మావాడు ఆ విషయంలో మా కంటే చాలా ముందుగానే సంకల్పించుకుని, ఏ దైవజ్ఞులు నిర్ణయించవలసిన అగత్యం లేకుండా, తనకు నచ్చిన పిల్లతో ఇండియావచ్చి, దండలు మార్చుకుని రిజిష్టర్డ్ మ్యారేజ్ చేసుకున్నట్టు తెలియపరిచాడు.

'మాతో మాట వరుసకైనా అన్నావు కాదేమిరా?' అన్నాం ఫోన్‌లో, మా నిరుత్సాహం ధ్వనించేలా.

'ఇది మా పెళ్లి. మా గోల. మధ్య మీ ప్రమేయం ఏముందీ?'' అన్నాడు మా వెధవాయి! 21వ శతాబ్దపు ప్రభంజనం తీవ్రంగానే ఉందనుకున్నాం. అయినా మా పూర్వవాసనలు వదులుకోలేక అన్నాం ''పెళ్లి చేసుకున్నారు, సంతోషం. రిజిస్ట్రార్ ఆఫీసులో సంతకాలు, వేలిముద్రలు కాకుండా, మా ముచ్చట తీర్చడానికైనా మీరిద్దరూ మన ఊరు వచ్చి, పీటల మీద కూర్చుని ఆ మూడు ముళ్లూ వేశాననిపించు.'' మా కంఠంలో పాతిక పాళ్లు అధికారం, డెబ్భయి అయిదు పాళ్లు అభ్యర్థన మిళితం చేశాం.

''ఛీ, మూడు ముళ్లూ, ఆరు ముళ్లూ వేయడానికి ఆ అమ్మాయి ఏమైనా ఆవు దూడా? మేకపిల్లా? అసలు నేను మూడు ముళ్లు వేస్తే ఆ అమ్మాయి నా మెడలో ఆరు ముళ్లు వేస్తానంటుంది. అది మీరు భరించగలరా?'' మా వాడు సూటిగా అడిగాడు. మేం అవాక్కయ్యాం!

''పైగా ఈ ముళ్ల తతంగం బానిసత్వానికి చిహ్నం, నిదర్శనం. కాబట్టి అవన్నీ మరిచిపోండి'' అన్నాడు కోపంగా.

''మీకు అంతగా సరదాగా ఉంటే ఓ పార్టీ ఏర్పాటు చెయ్యండి.'' అన్నాడు మావాడు కొంత మెత్తబడి.

''పార్టీ అంటే మందు కూడా ఉంటుందా అబ్బాయ్?'' అని అడిగేశాం ధైర్యంగా, విషయం ముందే తేల్చుకుంటే మంచిదని.

''మందులేందే విందు లేదు. కావాలంటే, అమ్మా మీరూ చెరో పెగ్గూ లాగించండి.'' అన్నాడు మా సుపుత్రుడు, తన మాతృ, పితృ భక్తులను చాటుకుంటూ, ఇన్నేళ్లు ఇద్దరం పూజ చేసుకుని తులసీ తీర్థం సేవిస్తూ వచ్చాం. ఇక మావాడి పుణ్యమా అని ఆ 'తీర్థం' కూడా సేవించాలేమో!

'నీ ఇష్ట ప్రకారమే పార్టీ యిద్దాం! అన్నయ్య పెళ్లికి మల్లే శుభలేఖలు వేయించి, బంధు మిత్రులకు పంపమంటావా?'' అని అడిగాం భయంగా.

''వేసుకోండి, కాని కొన్ని షరతులు'' అన్నాడు.

''ఏమిటవి?'' అనడిగాం ఆదుర్దాగా..

''శుభలేఖల మీద, 'శ్రీరస్తూ, శుభమస్తు, అవిఘ్నమస్తు' లాంటి దండకాలుండ కూడదు. దేవుడి బొమ్మలుండకూడదు'' అన్నాడు మా వాడు ఖచ్చితంగా!

''దానికెందుకురా అంత అభ్యంతరం?'' అని అడిగాం విస్తుపోతూ. మా హేతువాద పుత్రుడు తన అభ్యంతరాలు ఇలా వివరించాడు.

''కాగితాలు ఖరాబు చేసి శుభం, శుభం అంటే శుభం జరుగుతుందా? అలా జరిగితే ఎందుకిన్ని వైధవ్యాలు, విడాకులు, కిరసనాయిల్ చావులు? చెప్పండి, ఇవన్నీ శుద్ధ...'' నాన్‌సెన్స్ అనబోయి ''యూస్‌లెస్'' అన్నాడు ఆవేశంగా.

మేం అవాక్కయి, కాసేపటికి తేరుకున్నాం.

''ఛీ, మూడు ముళ్లూ,
ఆరు ముళ్లూ వేయడానికి
ఆ అమ్మాయి ఏమైనా
ఆవు దూడా? మేక పిల్లా?
అసలు నేను మూడు ముళ్లు
వేస్తే ఆ అమ్మాయి నా మెడలో
ఆరు ముళ్లు వేస్తానంటుంది.
అది మీరు భరించగలరా?''
మా వాడు సూటిగా అడిగాడు.
మేం అవాక్కయ్యాం!

మావాడికి సాహిత్యమంటే యిష్టం. అది గుర్తుకొచ్చి అన్నాను ''పోనీ కవితాపరంగా బాగుంటుంది 'కమలాంజలి పుటేయా; పద్మరాగాయితా' అన్న శ్లోకమైనా వేయిద్దామా?''

''ఇదేమైనా కవితాగోష్ఠా కవిత్వాలు రాయడానికి. అయినా సెంటిమెంటు తప్ప ఆ శ్లోకం అర్థం ఎవరికీ తెలియదు. శ్రీరామచంద్రుడి ఆశీర్వచన మంటారూ... (అంటారు, నాకు తెలుసు) ఆయన్ని కట్టుకుని సీత 14 సంవత్సరాలు అరణ్యవాసం చేసింది. ఆత్మాభిమానం చంపుకుని శీల పరీక్షకు నిలబడింది. తర్వాత గర్భవతిగా ఉండగా రాముడు అడవులలో వదిలేస్తే, శోకించి, శుష్కించి కవలలను కని పెంచింది. చివరిగా రాములవారి టెస్టులు భరించలేక తల్లి భూదేవి ఒడిలోకి వెళ్లిపోయింది. మాకు సీతారాముల దాంపత్యం ఆదర్శం కాదు. అందుకని ఆ శ్లోకం వదిలెయ్యండి. అయినా ఇది శుభలేఖ కాదు కదా. రిసెప్షన్!'' అని నిర్ద్వంద్వంగా తన అమూల్య రిడిల్స్ ఆఫ్ రామాయణ అభిప్రాయాలు వినిపించాడు. మళ్లీ అవాక్కయ్యాం. వీడి ఆదర్శ దంపతులెవరో? మోనికా లూఇన్‌స్కీ యా? పాలా జోన్సా? సినిమా స్టార్లా? సరే వాడి వెర్రి వాడిది. మాకు ఒళ్లు మండినా, మండనట్టే శాంతంగా 'అలాగే రా, మీ దంపతుల ఇష్ట ప్రకారమే చేద్దాం' అని ఫోన్ పెట్టేశాను.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. ఈ ఆహ్వానం గురించే ఆలోచనలు. ఆలోచించిన కొద్దీ సందేహాలు ముంచుకొస్తున్నాయి. ఆహ్వానాలు ఎవరి పేర పంపాలి? నా పెళ్లి కనుక కార్డులు నా పేర ఎందుకు పంపావ్ అంటాడేమో! వెనక, మా అన్నగారి కొడుకు కూతురు పెళ్లికి శుభలేఖలు, మా నాన్నగారి పేర పంపారు. అలా, పెద్దవాళ్లకు గౌరవం ఇచ్చేవాళ్లం. మావాడి ధోరణి చూస్తుంటే కనీసం సన్ ఆఫ్ అని కూడా రాసేలా లేడు. విందుంటే మందుండాలన్నాడు. మరి మందుంటే మాంసం ఉండాలంటాడేమో! ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది. కలత నిదురలో పాత కొత్తల కలయికతో ఓ వింత, వికృత ఆహ్వానం స్ఫురించింది. ఇలా సాగింది.

''బంధుమిత్రులకు'' ఆహ్వానం...

మా ఆఖరి కుమారుడు రాజేష్ వివాహ శుభలేఖ పంపవలెనని ఆశించినాము. కానీ అమెరికా నుంచి తన స్నేహితురాలితో వచ్చిన మా సుపుత్రుడు ఇండియా వచ్చి ఆ అమ్మాయిని రిజిష్టర్డ్ మ్యారేజీ చేసుకున్నట్టు, నిన్ననే మద్రాసు నుంచి ఫోన్‌లో తెలిపినాడు. హనీమూన్ అమెరికాలోనే జరుపుకున్నట్టు, పరిచయమైన కొద్ది రోజుల నుండే హనీమూన్ సాగుతున్నట్టు వాడి మాటల సందర్భంలో తెలిసినది. పెద్ద వయసులో మేం చేయాలని ఉబలాట పడ్డ రెండు శుభకార్యములు అమెరికా పుణ్యమా అని మాదాకా రాకుండా జరిగిపోయినవి. చివరకు మావాడి, అనుమతి, సూచనల మేరకు, మావాడి వివాహ సందర్భమున, విందు, విందులో మందు, మందులో మాంసంతో చిన్న పార్టీ ఏర్పాటు చేశాను. కనుక మీరు వచ్చి భార్యాభర్తలను ఆశీర్వదించాలి. నేను ఇక మూడు నాలుగు నెలల్లో మనవణ్ణి ఎత్తుకునే శుభఘడియ కూడా రావచ్చని సందేహంతో కూడిన సంతోషంతో ఉన్నాను.

గమనిక : ఆశీర్వచనాలు. నాకు, నా శ్రీమతికి ''మీ కొడుకు, కోడలు పుత్రపౌత్రులతో కలకాలం సుఖంగా ఉండాలని మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాం' అనండి. మా వాడికి ఆశీర్వచనాలు పడవ్! మీరు తప్పక రావాలి. మీరు కనక రాకపోతే, 'ఇక మీ ఇంట్లో ఏ శుభకార్యానికి ఛస్తేరానని మూర్ఖుడిలా పంతాలకుపోను. ఈ రోజుల్లో ఎవరి పనులు వాళ్లవి. 'తప్పక' అని మాట వరసకు రాశాను. మీ పిల్లలకు స్కూలు సెలవులు దొరికి, మీకు ట్రెయిన్ రిజర్వేషన్ దొరికి, ఆరోగ్యం బాగుండి, టివి సీరియల్స్ రెండు రోజులుపోయినా ఫరవాలేదనుకుంటే రండి. కష్టపడి, నష్టపడి రావద్దు. ఓ యాభై పైసల కార్డు గీకి పారేయండి. మీరు స్వయంగా వచ్చినంత సంతోషిస్తాము.

మీ బంధువులలో కొందరు, బాగా తీరిక ఉన్న వాళ్లు ఇదే వృత్తిగా పెట్టుకున్న వాళ్లు, పది రోజులు

ముందే వచ్చి అన్ని పనులు చేసి పెడతానులే వదినా, నువ్వేం దిగులుపడకు' అంటూ ముందే రావాల్సిన అవసరం లేదు. అంతా కాంట్రాక్ట్‌కిచ్చేశాం. భోజనం, లైటింగ్, కాఫీలు, డ్రింకులు, చివరకు అతిథులను రిసీవ్ చేసుకోవడం వరకు అన్నీ కాంట్రాక్టు.

కాంట్రాక్టరు ముందరే వచ్చి అన్ని సిద్ధం చేస్తాడు. మనందరం పెళ్లివారిలా రావడమే. అక్కడ మీరెంతో మేమూ అంతే. బఫే డిన్నర్ కనుక, ప్లేట్లు పుచ్చుకుని లైనులో వెళ్లి ఎవరిక్కావలసినవి వాళ్లు వడ్డించుకు తినడమే. ''బావగారూ అన్నీ అందాయా? మరో స్వీటు లాగించండి' లాంటి మర్యాదలకు అవకాశం లేదు. మీరు మోహమాటపడి కావలసినవి తీసుకు తినకపోతే ఆ తప్పు మీదే! మీరు అప్పడం కొరికినా ప్లేటుకింతని మాకు బిల్లు పడుతుంది. చాలా మంది ప్లేటు పట్టుకుంటే చెయ్యిలాగి త్వరగా ముగించేస్తారు. అదే కాంట్రాక్టరుకి లాభం. కుర్చీలు వేయిస్తాం. మాటి మాటికి క్యూలో వెళ్లిరావాలి. వచ్చాక మీ కుర్చీ ఖాళీగా ఉండాలి. ఈ అవస్థలు పడలేక మొదట వేసుకున్న దాంతోనే సరిపెట్టుకుంటారు కొందరు. బఫే డిన్నర్‌కి కంఠబలం ముఖ్యం.

మేం ఫ్లాట్‌లో జైలు పక్షుల్లా ఉన్నాం. పక్క ఫ్లాటు వాళ్లు అంగుళం స్థలం కూడా ఇవ్వరు. వచ్చే అతిథులకు విడిది ఏర్పాట్లు లేవు. మీ బస ఏర్పాటు మీరే చేసుకోవాలి! కావాలంటే ఏ హోటల్లోనో రూమ్ రిజర్వ్ చేయించుకోండి. పార్టీకి వచ్చిన వాళ్లు డిన్నర్ అవగానే అక్కడి నుంచి అలాగే జారుకోవచ్చు. అక్షింతలు వేసే కార్యక్రమం ఉండదు.మాతో చెప్పి వెళ్లాలని తాపత్రయ పడకండి. ఏమూలో ఉంటాం. వీడియోలో పడేలా మాత్రం జాగ్రత్తపడండి. అటెండెన్స్ మార్క్ చేసుకుంటాం తర్వాత. మీకూ వచ్చినట్టు ఋజువుంటుంది. వీడియోలు తర్వాత ముఖ్యపట్టణాల్లో మా బంధువుల ఇంట్లో వేయిస్తాం. ఇక్కడకు రాలేని వాళ్లు వీడియో చూసినా చాలు. రిసెప్షన్‌కొచ్చినంత ఫలితం! మరీ ఓవరైపోయి 2 గంటలూ చూడకండి బోర్ కొట్టేస్తుంది. ఓ పది నిమిషాలు చూసి అర్జంటు పనుందని బయట పడండి.

అన్నట్టు, గిఫ్టులు తేకండి. మా వాడికి గిఫ్టులు గిట్టవ్. నా మొహం చూసి తెచ్చినా, నాకే యివ్వండి. ఎండలో బజార్ల వెంటపడి తిరిగి, కొత్తవే కొనక్కరలేదు. ఇదివరలో మీకు వచ్చిన గిఫ్టుల్లో పేరు రాయనివి కొత్త పేకింగ్ చేసి మాకివ్వండి చాలు. మీరు పేరు రాయకండి. ముందు, ముందు మేమూ అలాగే ఉపయోగిస్తాం.

ఇక, వధూవరులను, మా విషయంలో, భార్యాభర్తలను చూశారా అని ఆరా తీసే వాళ్లెవరూ ఉండరు. కనుక మీరు వచ్చిన వాళ్లు వచ్చినట్టు వెళ్లిపోవచ్చు. కొందరు మాత్రం పెళ్లికూతురుని చూడాలని మహా ఉబలాటపడతారు. ''మా కోడలు కన్నా బాగుంటుందా? మా అమ్మాయి దీనికి తీసిపోతుందా?'' అని ఆడవాళ్లకి కుతూహలం దొలిచేస్తూ ఉంటుంది. కానీ, భార్యాభర్తలను ఉత్సవ విగ్రహాల్లో సింహాసనాల మీద కూర్చోపెట్టం. మనతోనే కలిసి తిరుగుతూ ఉంటారు. మా కోడలు పట్టుచీరే కట్టదు. మల్లెపూలు, మొగలి రేకులతో కట్టిన బారెడు జడ ఉండదు. అసలుజుట్టు భుజాల దాకా ఉంటే అదృష్టవంతులం? బోయ్ కట్ చేయించుకుని, జీన్స్, టీ షర్ట్ వేసుకుంటే అసలు ఆడో, మగో గుర్తించడం కష్టం. ఎత్తు పల్లాలను బట్టి తప్ప! అందుకని, పెళ్లికూతురి అలంకరణంతా మా అమ్మాయికి చేసి, మా కోడలు వెనకే తిరగమన్నాం, మా అమ్మాయి ముందున్నదే మా కోడలుగా గుర్తించ ప్రార్థన. ఇవన్నీ మనిషి మనిషికి చెప్పడం వీలు పడదు కనుక ఈ ఆహ్వాన పత్రంలో పొందుపరుస్తున్నాం.

వీలు చూసుకుని మీరు వచ్చి (సకుటుంబంగా కాదు) మదర్పిత (అంటే కాంట్రాక్టరు సప్లై చేసిన) చందన (చందనం ఎప్పుడో విదేశాలకు పోతోంది. మనకి మిగిలింది సెంటు కలిపిన రంపపు పొట్టు) తాంబూలాది (కంట్రాక్ట్ కిళ్లీ) సత్కారములు (సత్కారాలంటూ ఏమీ ఉండవు. మిషన్‌తో ద్వారం దగ్గర పన్నీటి (స్ప్రే తప్ప) స్వీకరించి, వెనువెంటనే మీ, మీ ఇళ్లకు వెళ్లి మమ్మానందింప చేయ ప్రార్థన.

ఇట్లు
వి. నరసింహం
ఫాదర్ ఆఫ్ రాజేష్, యు.ఎస్.ఏ.
తణుకు, విలేజీకాని, టౌనుకాని,
సిటీకాని, ఒక ఊరు.

